ప్రజాశక్తి

శుక్రవారం 29 డిసెంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు వెలికితీత

- ఊపిరి పీల్చుకున్న మత్స్యకారులు
- భారీ క్రేన్‌లను రంగంలోకి దింపిన పోర్టు అధికారులు
- పదిరోజుల్లో రూ.50లక్షల ఖర్చుతో వైజాగ్ పోర్టు 'ఆపరేషన్'

క్రేన్ సహాయంతో బోట్లును వెలికితీస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఫిషింగ్ హార్బర్ (చేపలరేవు)లో నవంబర్ 19న జరిగిన భారీ అగ్నిప్రమాదంలో అగ్నికి ఆహుతై సముద్రంలో మునిగిపోయిన 29 మర పడవలు, బోట్లను వైజాగ్ పోర్టు యాజమాన్యం చొరవ చేసి వాటన్నిటినీ గురువారం నాటికి వెలికితీసింది. ఈ నెల 18న బోట్ల వెలికితీత ఆపరేషన్‌ను వైజాగ్ పోర్టు మెటీరియల్ మేనేజర్ ఆధ్వర్యాన చేపట్టింది. 29 బోట్లు సముద్రంలో నీట మునిగాయి. ఇవిగాక మరో 18 పాక్షికంగా దెబ్బతిన్నాయి. వేటకెళ్లి వచ్చాక తమ బోట్లను యాంకరింగ్ చేయడం కష్టమైన పని అంటూ మత్స్యకారులు ఇప్పటికే ఆందోళన చెందుతున్న సంగతి తెలిసిందే. హై కెపాసిటీ 150 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల భారీ క్రేన్‌లను రంగంలోకి దింపి బోట్లను శిథిలాలతో సహా బయటకు దాసింది. దీంతో మత్స్యకారులంతా ఊపిరి పీల్చుకున్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైవర్లు, కట్టర్లతో ఆపరేషన్...

అగ్నికి ఆహుతై సముద్రంలో మునిగిపోయిన బోట్లను అండర్ గ్రౌండ్ డ్రైవర్లు, అండర్ గ్రౌండ్ కట్టర్లను రంగంలోకి దింపడంతో ఈ పని సులువు అయ్యినట్లు మెటీరియల్ మేనేజిమెంట్ విభాగ ఉన్నతాధికారి తెలిపారు. జెట్టీ నెంబర్11లోకి డామేజ్ అయిన బోట్లను తెచ్చి ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్‌కు అప్పగించినట్లు చెప్పారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి బోట్లను, వాటి శిథిల విభాగాలన్నిటినీ మొత్తంగా వెలికి తీశారు. బోట్ల వెలికితీత సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర మత్స్యశాఖ, ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్, స్థానిక పోలీసులు, విశాఖ పోర్టు అథారిటీ సంయుక్తంగా సముద్రంలో మునిగిపోయిన బోట్లన్నిటినీ సమన్వయంతో బయటకు తీశారని పోర్టు ఛైర్మన్ ఎ అంగముత్తు ఈ సందర్భంగా వెల్లడించారు. 10 రోజుల్లో ఈ ఆపరేషన్‌ను పూర్తిచేసి ఫిషింగ్ హార్బర్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలన్న లక్ష్యం నెరవేరింది. పోర్టు అధికారులు తీసుకున్న చొరవను ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అభినందించింది.

సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారులు

దద్దరిల్లేలా.. ధూమ్ ధామ్

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రజానాట్యమండలి ఆధ్వర్యాన గాజువాక లంక గ్రౌండ్‌లో గురువారం సాయంత్రం ప్రారంభించిన ధూమ్‌ధామ్ కార్యక్రమం దద్దరిల్లేలా సాగింది. ముందుగా ప్రజానాట్యమండలి సభ్యులతోపాటు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, సిపిఎం, సిఐటియు నాయకులతో కలిసి ప్రారంభానికి ముందు డప్పు కొట్టి ధూమ్ ధామ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాయకులు ప్రసంగం అనంతరం వివిధ కళారూపాలు ప్రదర్శించారు. శ్రమజీవి జగతికి మూలమంటూ చిన్నారులు ప్రదర్శన చేపట్టారు. 'చెమటోర్చక జరగదు కాలం, శ్రమశక్తి విశ్వం సమస్తం' అనే పాటతో ప్రారంభమైన ధూమ్ ధామ్ రాత్రి వరకు కొనసాగింది. సేవ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ పేరుతో కళాకారుల పాడిన పాట ఆకట్టుకుంది. 'రారా మోడీ లోన మోడీ రాజ్యంలోనా' కళాకారుల పాడిన పాట అందర్నీ ఆకట్టుకుంది ఖబడ్దార్ మోడీ, ఎవడురా ఆమ్మేది? ఎవడురా కొనేది అంటూ చిన్న పిల్లల నుంచి కళాకారుల వరకు అందరూ ఆలపించారు. మొదటి రోజు భారీ జన సందోహం మధ్య ధూమ్‌ధామ్ ప్రారంభమైంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలన్న నినాదంతోనే కళాకారులు ప్రదర్శించిన కళారూపాలను ప్రజలు మంచులో కూడా చాలా ఓపిగ్గా తిలకించారు.

ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి

వార్త 2లో..

హైడ్రో పవర్ ప్లాంట్ పనులు అడ్డగింత

వార్త మెయిన్‌లో..

సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల వంటా-వార్పు

వార్త 2లో..

విశాఖలో క్యాంపు కార్యాలయాల ఏర్పాటుపై అత్యవసర అప్పీల్ పిటిషన్

వార్త 2లో..

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ముఖ్యమంత్రికి రాసిన పోస్టుకార్డులను చూపిస్తున్న అంగన్‌వాడీలు

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పోస్టు కార్డులతో ఉద్యమం

17వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

వార్తలు 8లో..

రైతుకు తీరని కష్టం

- సాగునీటి కల్పనలో పురోగతి లేమి
- కరువు, తుపానుతో తీవ్ర నష్టం
- కనికరం చూపని ప్రభుత్వం
- ఇదీ ఈ ఏడాది వ్యవసాయ స్థితి

అనకాపల్లి జిల్లా మునగపాకలో నేలకొరిగిన వరి పంట (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలో సాగునీటి వనరులు అభివృద్ధి చేయకపోవడంతో రైతుకు యథాలాపంగా పంట నష్టం జరుగుతోంది. వ్యవసాయాభివృద్ధికి అవసరమైన సాగునీరు సరిపడాలేకపోవడం, సహకార చక్కెర ఫ్యాక్టరీలను ఆధునీకరించి తెరిపించకపోవడంతో ఈ ఏడాదీ రైతుకు సాగు నష్టం భరించకతప్పలేదు. సాగునీటి వనరులుండీ సకాలంలో పంట వేసుకోగలిగితే డిసెంబరులో వచ్చిన మిచాంగ్ తుపానుకు ముందే వరి పంట కళ్లాలకు వచ్చేది. సాగు ఆలస్యంకావడంతో కోతల సమయంలో తుపానుకు పంట దొరికింది. రైతుకు తీరని నష్టం వాటిల్లింది. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో బాబూజగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నిధులకు కోత పెట్టింది. పెద్దేరు ప్రాజెక్టుకు రెండేళ్ల నుంచి డబ్బులు ఇవ్వలేదు. ఈ ఏడాది రైవాడకు నిధులు కేటాయించలేదు. సుజల స్రవంతికి రూ.297.50 కోట్ల

మిగతా 2లో..

భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : భవన నిర్మాణ కార్మికుల నిధులతో ఏర్పాటైన వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి, అందులో ఉన్న నిధులను భవన నిర్మాణ కార్మికుల కోసం ఖర్చు చేయాలని విశాఖ జిల్లా బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షుడు బి.వెంకటరావు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో సహా దేశంలో అన్ని రాష్ట్రాలలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారానే అమలు చేస్తున్నారని, అదే విధానాన్ని మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత 6 నెలలు ఇసుక నిలిపివేయడం, తరువాత కోవిడ్ కారణంగా పనులు దొరక్క పోవడంతో భవన నిర్మాణ కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని గుర్తుచేశారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు చెందిన డబ్బులు సుమారు రూ.1,300 కోట్లు వేరే పథకాలకు మళ్లించి, భవన నిర్మాణ కార్మికుల పొట్ట కొట్టారన్నారు. యూనియన్ అధ్యక్షులు పి.అనసూయ మాట్లాడుతూ, వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కెవిపి చంద్రమౌళి, భవన నిర్మాణ నాయకులు కె.నరసింగరావు, సిమ్మ నాయుడు, మసూరి అప్పారావు, రామారావు, బుజ్జి, నారాయణరావు, రాము నాయుడు, మద్ది సిరినాయుడు, పార్వతమ్మ, చిన్న, యర్రమ్మ, పెద్ద యర్రమ్మ, లక్ష్మిహ, పెంటారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్

వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగస్వామ్యం కావాలి

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆలోచనలకు అనుగుణంగా ప్రతి పౌరుడూ, అధికారీ, ప్రజాప్రతినిధి, స్వచ్ఛంద సేవకులు వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగస్వామ్యం కావాలని, అభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విశాఖలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏయూ కన్వెన్షన్ హాలులో ఏర్పాటుచేసిన ప్రత్యేక సభలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన వివిధ పథకాల ఉద్దేశాలను, లక్ష్యాలను వివరించారు. 2047 నాటికి భారత దేశం అభివృద్ధి చెందిన దేశాల సరసన తప్పక నిలుస్తుందని, ఈ కలను నిజం చేసేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాల్సి ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి భారతీయునికీ ఆర్థిక ప్రయోజనాలు అందించటమే వికసిత్ భారత సంకల్ప యాత్ర ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. అనంతరం అందరిచేత గవర్నర్ ప్రతిజ్ఞ చేయించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల గురించి కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సాల్మన్ ఆరోక్య రాజ్, జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ వివరించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, ఏయూ ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ కె.సమత పాల్గొన్నారు.

సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల వంటా-వార్పు

వంటా వార్పు చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద గురువారం దీక్షలు నిర్వహించారు. దీక్షల్లో పాల్గొన్న ఉద్యోగులంతా గాంధీ విగ్రహానికి ఎదురుగా ఉన్న రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో, మానవహారం నిర్వహించారు. అనంతరం శిబిరం ప్రాంతంలో వంటా-వార్పు చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల ఉద్యమానికి కెజిబివిఎస్ ఉద్యోగులు మద్దతు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెజిబివిఎస్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శ్రీదేవి, ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.పుండరీకాక్ష, కార్యదర్శి ఎల్.చైతన్య, గణపతి తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో క్యాంపు కార్యాలయాల ఏర్పాటుపై

అత్యవసర అప్పీల్ పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి : విశాఖపట్నంలో క్యాంపు కార్యాలయాల ఏర్పాటు చేయాలన్న నిర్ణయం అమలును నిలిపేస్తూ సింగిల్ జడ్జి గతంలో జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయాలని ప్రభుత్వం అత్యవసర అప్పీల్ పిటిషన్ దాఖలుకు హైకోర్టు అనుమతినిచ్చింది. అప్పీల్ దాఖలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని హైకోర్టును ప్రభుత్వం కోరింది. లంచ్‌మోషన్ అత్యవసర అప్పీల్‌పై విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది చింతల సుమన్ అభ్యర్థించారు. దీనిపై చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. సాధారణ పిటిషన్ మాదిరిగా మంగళవారం విచారణ చేస్తామని ప్రకటించింది. ఉత్తరాంధ్ర అభివృద్ధి నిమిత్తం విశాఖపట్నంలో ప్రభుత్వ క్యాంపు కార్యాలయాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలు గుర్తిస్తూ ఐఎఎస్‌ల కమిటీ రిపోర్టు ఇచ్చింది. దీనికి అనుగుణంగా ప్రభుత్వం జిఓ 2283 జారీ చేసింది. దీనిని సవాల్ చేసిన పిటిషన్లను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారాన్ని త్రిసభ్య ధర్మాసనమే విచారించాల్సి ఉంటుందన్నారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్ దాఖలుకు నిర్ణయించినట్లు సిజె బెంచ్ వద్ద సుమన్ ప్రస్తావించారు.

మొదటి పేజీ తరువాయి..

రైతుకు తీరని కష్టం

బడ్జెట్ నుంచి రూ.141.79 కోట్లకు తగ్గించింది. తాండవకు ఐదు కోట్లు అవసరమని జలవనరుల శాఖాధికారులు ప్రతిపాదనలు పంపితే బడ్జెట్లో రూ.2.54 కోట్లకు పరిమితంచేసింది. పెద్దేరు, తాండవ, రైవాడ జలాశయాలు, కాలువల ఆధునీకరణ, పూడికతీత వంటి పనులు డబ్బుల్లేక చేపట్టకపోవడంతో ప్రధాన కాలువల సమీప ఆయకట్టుకు సాగునీరు అందించలేని పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 2.04 లక్షల ఎకరాల్లో సాగు కావాల్సివుండగా, తీవ్ర వర్షాభావంతో 1.35 లక్షల ఎకరాల్లో సాగైంది. ఇందులో వరి 1.36 లక్షల ఎకరాలకు, 1.10 లక్షల ఎకరాల్లో నమోదైంది. ఇందులో తాండవ, రైవాడ, కోనాం, పెద్దేరు జలాశయాల కింద 75,414 ఎకరాల ఆయకట్టుకుగానూ, నీరులేక 60,269 ఎకరాల్లో పంట సాగైంది. పొట్ట దశలో వర్షాలు ఎడపెట్టడం, ఆయకట్టుకు నీరు ఇవ్వలేకపోవడంతో ఐదువేల ఎకరాలకు పైగా వరి పంట ఎండిపోయింది. జిల్లాలోని 24 మండలాలకు 12 మండలాల్లో 25 నుంచి 50 శాతం మధ్య వర్షపాతం లోటు ఏర్పడింది. అచ్యుతాపురం, నక్కపల్లి, పాయకరావుపేట, రాంబిల్లి మండలాల్లో 50 శాతానికి మించి వర్షపాతం లోటు నమోదైనా ప్రభుత్వం కనికరించలేదు. కరువు మండలాలుగా ప్రకటించలేదు. కరువుతో నష్టపోయిన రైతును ఆదుకోలేదు. కనీసం కొద్దిపాటి పంటైనా చేతికొస్తే పెట్టుబడులకు చేసిన అప్పులు తీర్చుకుందామని పడ్డ రైతుల ఆశ చివరకు ఫలించలేదు. కోసిన పంట నీట మునిగింది. ధాన్యం నాణ్యత, దిగుబడి తగ్గింది. 33 శాతానికిపైగా పంటపోయిన విస్తీర్ణం 16వేలు ఎకరాలని వ్యవసాయశాఖ లెక్క తేల్చింది. వాస్తవానికి దీనికి రెట్టింపు పంట నష్టం జరిగింది.

జిల్లాలో వరి తరువాత అధికంగా సాగుచేసే చెరకు విస్తీర్ణం ప్రభుత్వ చర్యలతో తగ్గుతూ వస్తోంది. క్రషింగ్ నిలిపివేసిన తుమ్మపాల, తాండవ, ఏటికొప్పాక సహకార చక్కెర ఫ్యాక్టరీలను ఆధునీకరించి తెరిపించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. ఫ్యాక్టరీల క్రషింగ్ పునరుద్ధరించకపోవడంతో చెరకు సాగు విస్తీర్ణం తగ్గింది. చెరకు సాధారణ సాగు విస్తీర్ణం 60వేల ఎకరాలకు 21వేల ఎకరాలకు తగ్గింది. ఇందులో ఎక్కువ భాగం గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ప్రాంతంలో చెరకు సాగు నమోదైంది.

జివిఎంసి బడ్జెట్‌కు స్థాయీ సంఘం ఆమోదం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ 2024-25 వార్షిక సంవత్సరానికి బడ్జెట్‌ను స్థాయీ సంఘం సభ్యులు సుదీర్ఘంగా చర్చించి ఆమోదించారని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనా సంగ్రహంగా ప్రారంభ నిల్వ రూ.664.33 కోట్లు, అన్ని పద్దుల కింద జమలు రూ.4949.89 కోట్లు, ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.5614.22 కోట్లు, అన్ని పద్దుల కింద ఖర్చులు రూ. 5457.23 కోట్లు, ముగింపు నిల్వ రూ.156.99 కోట్లని మేయర్ తెలిపారు. ఈ స్థాయీ సంఘ సమావేశంలో స్థాయి సంఘం సభ్యులతో పాటు జివిఎంసి ప్రధాన ఇంజినీరు రవికృష్ణంరాజు, పట్టణ ప్రణాళికాధికారి సురేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, డిసి (రెవిన్యూ) ఫణి రామ్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం.దామోదరరావు, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) పాపునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వంశీకృష్ణది ఆత్మహత్యా సదృశ్యమే : అమర్‌నాథ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ వైసిపిని వదిలి వెళ్లడం ఆత్మహత్యా సదృశ్యమేనని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు. గురువారం కలెక్టరేట్‌లో ఒక కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ, వంశీకృష్ణ శ్రీనివాస్ రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నారన్నారు. వైసిపి ఆయనకు అన్ని పదవులు ఇచ్చి గౌరవించిందని తెలిపారు. జగన్ ఏ అన్యాయమూ చేయలేదని వంశీయే చెప్పారన్నారు. తనకు రానున్న ఎన్నికల్లో పార్టీ సీటు ఇచ్చినా, ఇవ్వకపోయినా పర్వాలేదు, జెండా పట్టుకుని పార్టీ కోసం పాటుపడతానని తెలిపారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే వారిని సస్పెండ్ చేస్తామన్నారు. వైసిపిలో సీట్లు ఇవ్వడం లేదని, వెళ్ళిపోతున్నామని చెబుతున్నారని, వారి వల్ల వైసిపికి ఎటువంటి నష్టమూ లేదని పేర్కొన్నారు. పార్టీ మేలు కోరే జగన్మోహన్‌రెడ్డి మార్పులు చేర్పులు చేస్తున్నారన్నారు. విశాఖలో త్వరలో రంగా విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారని తెలిపారు.

చెడు వ్యసనాల నుంచి విముక్తి కావాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : యువత మాదకద్రవ్యాలు, మద్యపానం, అశ్లీలం, జూదం వంటి చెడు వ్యసనాలకు విముక్తి పలకాలని ఐడియల్ యూత్ మూమెంట్ రాష్ట్ర అధ్యక్షులు కలీముల్లా ఖాన్ కోరారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో 'మరలి రాదు ఈ జీవితం' మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకే జీవితం, ఒకే అవకాశం అన్నారు. మన చేతుల నుంచి ఒకసారి చేజారిపోతే ఈ జీవితం వెనక్కి రావడం అసాధ్యమని అన్నారు. అందుకే యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, మద్యపాన వ్యసనం వల్ల 2021లో రాష్ట్రంలో 8067 ఆత్మహత్యలు నమోదయ్యాయని, జాతీయ స్థాయిలో ఆరో స్థానంలో ఎపి ఉందని గుర్తు చేశారు.

ద్రోణంరాజుకు ఘన నివాళి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : సిరిపురం జంక్షన్ వద్ద ఉన్న ద్రోణంరాజు సత్యనారాయణ కాంస్య విగ్రహం వద్ద ఆయన వర్ధంతిని నిర్వహించారు. సత్యనారాయణ విగ్రహానికి ద్రోణంరాజు శ్రీవాత్సవ్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మీడియాతో మాట్లాడుతూ ద్రోణంరాజు సత్యనారాయణ ఇల్లు ఒక రాజకీయ విశ్వవిద్యాలయమని, ఎందరో రాజకీయ నాయకులను తయారుచేసిన ఘనత ఆయనకు దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎయు మాజీ రెక్టార్ ప్రసన్నకుమార్, పేడాడ రమణి కుమారి, కార్పొరేటర్లు తోట పద్మావతి, బిపిన్ కుమార్‌జైన్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల వెంకటరావు, కొరిబిల్లి సురేష్, బోధలపాటి ఉమమహేశ్వరరావు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మార్గశిర మాసంలో మూడో గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు పొటెత్తారు. అమ్మ వారిని దర్శించుకొని విశేష పూజలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి 12.01 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించాక భక్తులకు 1.30 గంటల నుంచి అమ్మవారి దర్శనాలు కల్పించారు. ఈ పూజలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. శిరీష, ఎఇఒ తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు. మహిళలు, వృద్ధులు, గర్భిణీలు, పిల్లలకు ప్రత్యేక వసతులు కల్పించడంతోపాటు క్యూల్లో భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. వృద్ధులు గర్భిణీల పట్ల ప్రత్యేక శ్రద్ధతో టౌన్ కొత్త రోడ్డు నుంచి ఉచిత ఆటోల్లో దేవస్థానానికి చేర్చి దర్శనాలు కల్పించారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE :: TIRUPATI
O.S. NO. 33 OF 2017
Puttur Murali Vasu @ Vasu .....Plaintiff
Vs
1. P. Kesavachari & 19 others ....Defendants
Summons to Defendant No.8
8. P.R. Ramana,
S/o late P. Ramachandra Achary,
residing at D.No. MIG 2- 166,
PM Palem, HB Colony,
Visakhapatnam.
Whereas the plaintiffs has instituted a suit against you, you are here by summoned to appear in the court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some other person able to answer all such questions on the date 29-01-2024 at 10.30 am, in the forenoon answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defense. Take summons that in default of your appearance on the day above mentioned, the suit will be heard and determined in your absence.
M. RAVI KUMAR,
Advocate Tirupati.

మార్చి 24 నుంచి 'ఓపెన్' పరీక్షలు

ప్రజాశక్తి - ఆరిలోవ : 2024 విద్యాసంవత్సరానికి సంబంధించి సార్వత్రిక విద్యాపీఠం పది, ఇంటర్ పరీక్షలను మార్చి 18 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు డిఇఒ ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్ మార్చి 30 నుంచి ఏప్రిల్ 4 వరకు, రెండు పూటలా ఉంటాయన్నారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజును జనవరి 5 నుంచి 19 వరకు చెల్లించవచ్చన్నారు. రూ 25లు అపరాధ రుసుంతో జనవరి 20 నుంచి 27 వరకు, రూ 50లు అపరాధ రుసుంతో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3 వరకు చెల్లించవచ్చన్నారు.

గణిత బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-ఆనందపురం: విద్యాబోధనలో ముఖ్యంగా గణితం సబ్జెక్టు బోధించేటప్పుడు విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని ఆర్‌జెడి జ్యోతికుమారి, డిఇఒ చంద్రకళ సూచించారు.గురువారం స్థానికజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆనందపురం, పద్మనాభం మండలాల గణిత ఉపాధ్యాయులకు నిర్వహించిన సబ్జెక్టు స్కూల్ కాంప్లెక్సును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిపైనా వ్యక్తిగత శ్రద్ధ చూపి, వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దగల బాధ్యత ఉపాధ్యాయులకు ఉందన్నారు, ఖాళీ సమయాల్లో సమీప ప్రాథమిక పాఠశాల వెళ్లి అక్కడ విద్యార్థులకు సులభంగా గణితం అర్థమయ్యేలా బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒలు పద్మావతి, గంగరాజు, హెచ్ఎం శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్ పట్నాయక్ పాల్గొన్నారు.

ద్రోణంరాజు ఘన నివాళి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఏడవ వార్డు చంద్రంపాలెం, కృష్ణా నగర్ కాలనీ ద్రోణంరాజు సత్యనారాయణ కల్యాణమండపం ఆవరణలో ఉన్న ద్రోణంరాజు విగ్రహానికి వైసిపి నేతలు నివాళులర్పించారు. ద్రోణంరాజు సేవలను సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడుకొనియాడారు. కార్యక్రమంలో పిళ్లా సూరిబాబు,వైసిపి నేతలు పివిజి. అప్పారావు, పిళ్లా అప్పన్న, పిళ్లా చంద్రశేఖర్, పిళ్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, పీస రామారావు, అల్లాడ ఎర్రిబాబు, ద్రోణంరాజు అభిమానులు పాల్గొన్నారు.

నేటినుంచి సాయంత్రం రైతుబజార్

ప్రజాశక్తి -మధురవాడ : శుక్రవారం నుంచి సాయంత్రం వేళల్లోనూ మధురవాడ రైతు బజార్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని ఎస్టేట్ అధికారి జగదీష్ తెలిపారు. మధురవాడ పరిసరాల్లో అధిక శాతం జనాభాను దృష్టిలో పెట్టుకుని, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మార్కెటింగ్‌శాఖ రైతుబజారు ప్రారంభించిందన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో వంశీ ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో చిట్టివలస బొగ్గు రోడ్డు శ్రీకృష్ణా జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ ఫస్టియర్ ఎంపిసి విద్యార్థి కె వంశీ రజతపతకం సాధించినట్లు కళాశాల చైర్మన్ బి నరసింగరావు తెలిపారు. విశాఖ నగరంలో 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో భాగంగా రాష్ట్రస్థాయి పతకాన్ని సాధించిన వంశీని అభినందించారు. అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు

బాబు ష్యూరిటీపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు 11వ వార్డు టిడిపి అధ్యక్షుడు ముగడ రాజారావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పేరుతో టిడిపి మేనిఫెస్టోపై గురువారం ప్రచారాన్ని నిర్వహించారు. ప్రియదర్శిని కాలనీలో ఇంటింటికి వెళ్ళి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంచి పెట్టారు. టిడిపి నాయకులు ఆబోతుల అప్పలనాయుడు, ఎం.కృష్ణంరాజు, మూది అప్పారావు, రేఖా జ్యోతి పాల్గొన్నారు.

పాఠశాలకు మైకిసెట్ వితరణ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి జెడ్‌పి హైస్కూల్‌కు రూ.16 వేలు విలువైన మైకిసెట్‌ను ఎంపిపి దంతులూరి వెంకటశివ సూర్య నారాయణరాజు (వాసురాజు) తన సొంత నిధులతో కొనుగోలు చేసి గురువారం అందజేశారు. మైకిసెట్ బహూకరించిన ఎంపిపికి పాఠశాల హెచ్ఎం సన్యాసినాయుడు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లూరి పైడప్పుడు, ఎంపిటిసి నగేష్‌బాబు పాల్గొన్నారు

ప్రొటోకాల్ రగడ!

- విపక్ష మహిళా కార్పొరేటర్ రాకుండానే శంకుస్థాపన
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి వ్యాఖ్యలతో చెలరేగిన వివాదం
- వైసిపి, టిడిపి నేతలు, కార్యకర్తల బాహాబాహి

ప్రజాశక్తి - పిఎం.పాలెం : విపక్ష కార్పొరేటర్, నేతలను ఉద్దేశించి అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి చేసిన వ్యాఖ్యలు వివాదానికి కారణమయ్యాయి. ప్రొటోకాల్ విషయమై ప్రశ్నించినందుకు టిడిపి నేతలను బయటకు తోసేయండంటూ పోలీసులను ముత్తంశెట్టి ఆదేశించడంతో గొడవ రేగి, టిడిపి, వైసిపి శ్రేణులు బాహాబాహీకి దిగి ఉద్రిక్తతకు కారణమయ్యాయి. జివిఎంసి ఐదో వార్డు బోరవానిపాలెంలో గురువారం సాయంత్రం పార్కు అభివృద్ధి ఓపెన్ జిమ్ పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శంకుస్థాపన చేశారు. అయితే ఆదేవార్డుకు చెందిన టిడిపి మహిళా కార్పొరేటర్ మొల్లి హేమలత రాకముందే శంకుస్థాపన చేయడంపై టిడిపి నేతలు జివిఎంసి జోనల్ ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. ప్రొటోకాల్ పాటించాల్సిన బాధ్యత లేదాయని ప్రశ్నించారు. దీంతో అక్కడ వాగ్వాదం చోటుచేసుకోగా, ఎమ్మెల్యే ముత్తంశెట్టి కలగజేసుకుని, టిడిపి నేతలకు అక్కడ పనేంటని, వారిని బయటకు తోసేయాలంటూ పోలీసులను ఆదేశించడంతో గొడవ తీవ్రమైంది. ప్రశ్నించిన టిడిపి నేతలను, తెలుగు మహిళా నేతలను పోలీసులతో బయటకు గెంటేసి, శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నిర్వాకంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుడి సమీపంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు, టిడిపి హయాంలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపాన్ని సచివాలయంగా మార్చేసి స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా వ్యవహరించడమే కాకుండా, విపక్ష నేతలన్నా, ప్రజలన్నా కనీస గౌరవం లేకుండా చులకనగా చూస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

బాహాబాహికి దిగిన వైసిపి, టిడిపి వర్గీయులు

టిడిపి శ్రేణులను హెచ్చరిస్తున్న ఎమ్మెల్యే

కేన్సర్ బాధితురాలి కుటుంబానికి అండ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫోర్త్ స్టేజ్ కేన్సర్‌తో బాధపడుతున్న బాధితురాలికి, ఆమె కుటుంబానికి పద్మభూషణ్ డాక్టర్ చిరంజీవి కళాపరిషత్ అండగా నిలిచింది. నగరంలోని డాబా గార్డెన్స్ ప్రాంతానికి చెందిన పి.లావణ్య కేన్సర్‌తో బాధపడుతుండగా, ఆమె భర్త పెనుమత్సవర్మ ఆర్థికంగా ఇబ్బందులు పడుతూనే భార్యకు వైద్యం చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న చిరంజీవి కళాపరిషత్ అధ్యక్షులు గెంబలి జగదీష్, తన మిత్ర బృందంతో లావణ్యకు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు రూ.25వేల ఆర్థికసాయాన్ని గురువారం నగరంలోని పౌర గ్రంథాలయంలో కార్పొరేటర్ కందుల నాగరాజు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు. చేతుల మీదుగా లావణ్య కుటుంబీకులకు అందజేశారు. అలాగే నిత్యావసర వస్తువులు అందచేశారు. కళాపరిషత్ గౌరవ అధ్యక్షురాలు విజయ రమణి చీరలు, పండ్లు అందించారు.. లావణ్య ఇద్దరు పిల్లలను సినీ నటుడు రవితేజ దత్తత తీసుకుంటానని భరోసానివ్వగా, వారిని చదివించేందుకు పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు.లావణ్య భర్త వర్మకు ఉద్యోగం కల్పిస్తానని శ్రీకాకుళం రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధి మళ్ల కల్యాణ్ ప్రకటించారు. కష్టాల్లో ఉన్న తమకు అండగా నిలిచిన దాతలకు, ముఖ్యంగా జగదీష్‌కు లావణ్య కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బయ్య శ్రీనివాస్, శ్రీనివాస్ పట్నాయక్ ,ఎన్ శ్రీనివాసరావు, కోరాడ శ్రీనివాసరావు ,నవీన్, విశ్వేశ్వరరావు, అర్జునరావు పాల్గొన్నారు.

బడి బస్సుల భద్రతపై దృష్టి

ప్రజాశక్తి -మాధవధార : పాఠశాలలు, కాలేజీల బస్‌లు, ఆటోల అనుమతులు, వాటి నిర్వహణ, భద్రతపై రవాణాశాఖ అధికారులు దృష్టి పెట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం ఆదేశించారు. గురువారం మాధవధారలోని రవాణాశాఖ కార్యాలయంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జిసి.రాజరత్నం ఆధ్వర్యాన రవాణా, విద్య, స్త్రీశిశుసంక్షేమ శాఖల అధికారులతో స్కూళ్లు, కాలేజీ బస్‌లు, ఆటోలు నిర్వహణలో భద్రతాచర్యలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ, జిల్లాలో పాఠశాలలు, కాలేజీలకు ఎన్ని బస్‌లు, ఆటోలకు అనుమతిచ్చారు, వాటి నిర్వహణ, సామర్థ్యం, 1098 చైల్డ్ లైన్, పోలీసు టోల్ ఫ్రీ నెంబర్లను వాహనాల్లో స్పష్టంగా ప్రదర్శిస్తున్నారా, బస్‌ల్లో అగ్నిప్రమాద నివారణచర్యలు, ఇతరత్రా అన్ని వివరాలపై ఆరా తీశారు. ఏవైనా లోపాలుంటే తక్షణమే సరిదిద్దాలని ఆదేశించారు. సురక్షిత ప్రయాణమే కమిషన్ ధ్యేయమని, విఘాతం కలిగిస్తే apscpcr2018@gmail.com దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. డిటిసి రాజారత్నం మాట్లాడుతూ, కమిషన్ ఆదేశాల మేరకు సంబంధిత అన్నిశాఖల సమన్వయంతో విద్యాలయాల యాజమాన్యాలు, బస్ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. సమీక్షలో జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యురాలు ఎం. రజని, ట్రాఫిక్ సిఐ మళ్ళ అప్పారావు, గోపాలపట్నం ఎంఇఒ డి.దివాకర్, జిల్లా బాలల సంరక్షణ విభాగం పిఒఎస్. ఐ.సి.మమత, రవాణా శాఖాధికారులు ఆర్‌సిహెచ్. శ్రీనివాస్, ఐ.మాధవి, ఎస్.శిరీషాదేవి, ఎం. బుచ్చి రాజు, జి.సత్యంనాయుడు, గణేష్ రెడ్డి పాల్గొన్నారు

మాట్లాడుతున్న బాలల హక్కుల చైర్మన్ అప్పారావు

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలోని ఉపమాక గ్రామానికి చెందిన పొన్నాడ శివాజీ (21) గురువారం ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న శివాజీ మధ్యానికి బానిసయ్యాడు. గురువారం ఇంటిలో ఫ్యానుకు ఉరివేసుకుని అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను హుటాహుటిన నక్కపల్లి సిహెచ్‌సికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

50 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కృష్ణదేవిపేట చెరకు కాటా వద్ద ఆటోలో తరలిస్తున్న 50 కిలోల గంజాయిని పట్టుకొని ముగ్గురిని అరెస్టు చేసినట్లు కెడిపేట ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. గంజాయి రవాణాలో ప్రధాన నిండితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పాతకృష్ణదేవిపేటకు చెందిన కొయ్య సతీష్ , గజ్జి సాయి, వంకల ప్రసాద్‌లను అరెస్ట్‌చేసి కోర్టుకు తరలించామన్నారు. నిందితుల నుంచి సెల్‌ఫోన్, ఆటో సీజ్ చేసినట్లు తెలిపారు.

పోక్సో కోర్టు సంచలన తీర్పు

-అత్యాచార కేసులో నిందితుడికి పాతికేళ్ల జైలు,

- రూ.50వేలు జరిమానా

- బాధితురాలికి రూ.4.50లక్షల పరిహారం

ప్రజాశక్తి -విశాఖ లీగల్ : పదహారేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో విశాఖ స్పెషల్ పోక్సో కోర్టు సంచలన తీర్పునిచ్చింది. నిందితుడికి పాతికేళ్ల జైల్ శిక్ష, రూ. 50వేలు జరిమానా తో పాటు బాధితురాలికి రూ.4.50లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని న్యాయస్థానం తీర్పునిచ్చింది. సంఘటన వివరాల్లోకి వెళితే తన పదహారేళ్ళ కుమార్తె కేంద్రీయ విద్యాలయంలో పదవ తరగతి చదువుతున్న సమయంలో అక్కయ్యపాలెం ఆదిత్య ట్యూషన్ సెంటరులో చేర్పించారు. అప్పటి నుంచి ట్యూషన్ సెంటర్లో టీచర్ ఎం.జానకేశ్వరరావు ప్రతి రోజూ ఆమెను అసభ్యకరంగా తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడేవాడు. కొద్ది రోజుల తరువాత ఆమెపై అత్యాచారానికి పాల్పడి, నిందితుడి ఫోన్‌లో ఫోటోలు తీసి ఎవరికైనా చెప్తే ఆ ఫోటోలను సామాజిక మాధ్యమాలలో పెడతానని బెదిరించాడు. అలా పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయాన్ని 2020 ఫిబ్రవరి 27న బాధితురాలు తన సోదరుడికి చెప్పడంతో, ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, కోర్టులో నేరాభియోగపత్రాలు దాఖలు చేయగా, విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పునిచ్చారు.

పోటాపోటీగా కాలువ పనుల పరిశీలన

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 94వ వార్డు కృష్ణానగర్ మూడుగుళ్ల వీధిలో కాలువ పనులను టిడిపి కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, వైసిపి నేతలు బండి సత్తిబాబు, తామర్ల నర్సింగరావు, రామకృష్ణ, శ్రీకాంత్, వినోద్ వేర్వేరుగా పరిశీలించారు. రెండేళ్ల క్రితమే నిధులు మంజూరైనప్పటికీ, ఇన్నాళ్లు పనులు చేపట్టకపోవడంతో ఇటీవల ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ స్పందించి శంకుస్థాపన చేశారు. ఎట్టకేలకు పనుల్లో కదలిక రాగా, ఇన్నాళ్ల దీని ఊసెత్తని నేతలు ఇపుడు పోటాపోటీగా పరిశీలనకు వస్తున్నారు. కాగా ఈ పనులకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శంకుస్థాపన చేసిన సమయంలో ప్రొటోకాల్ పాటించలేదని, తనకు ఆహ్వానం లేదని స్థానిక కార్పొరేటర్ బల్ల శ్రీనివాస్ ఆరోపిస్తున్నారు. అయితే తన వార్డులో అభివృద్ధి పనులు జరగడాన్ని స్వాగతిస్తున్నారు. అదే సమయంలో ఇన్నాళ్లు కానరాని అధికార పార్టీ నేతలు ఇపుడు హడావిడి చేస్తున్నారని ఆరోపించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- వేపగుంట : వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై జివిఎంసి ఎనిమిదో జోన్ కమిషనర్ ఎంఎం.నాయుడు అవగాహన కల్పించారు. గురువారం చినముషిడివాడలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిజెపి నేత గొర్లె నాయుడు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన

ఆకులు తింటూ ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మెలో భాగంగా మూడోరోజున, గురువారం వినూత్న రీతిలో నిరసనలు చేపట్టారు. పలుచోట్ల చెవిలో పువ్వులు పెట్టుకుని, విశాఖ జివిఎంసి వద్ద ఆకులు తింటూ ఆందోళన చేయగా, అనకాపల్లిలో మోకాళ్లపై నిరసన చేపట్టారు. ప్రయివేటు కార్మికులతో పారిశుధ్య పనులు చేయించాలన్న అధికారుల చర్యలను పలుచోట్ల అడ్డుకున్నారు. (ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

వేపగుంటలో చెవిలో పూలు పెట్టుకుని మున్సిపల్ కార్మికుల నిరసన

ఆరిలోవలో రోడ్డుపైనే వంటావార్పు ఆందోళన

కలెక్టరేట్ (విశాఖ): మున్సిపల్ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. గురువారం జివిఎంసి జోన్-4 సూయజ్‌ఫారం వద్ద సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేశారని, దేవుళ్లతో సమానమని మున్సిపల్ కార్మికులకాళ్లుకడిగి, పూలు జల్లి, సన్మానించిన ప్రభుత్వం. ఇపుడు వారి న్యాయమైన డిమాండ్ పరిష్కరించకపోవడం సమంజసం కాదన్నారు. విశాఖలో పోటీ కార్మికులను తీసుకొచ్చి పని చేయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, ఎం.ఈశ్వరరావు, అశోక్, అప్పలరాజు, అనిత, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : లాసన్స్ బే కాలనీ సూయజ్ ఫారం వద్ద చెత్త తరలించే వాహనాలు బయటికి రాకుండా మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. చెవిలో పువ్వులతో నిరసన తెలిపారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.కృష్ణారావు, నాయకులు జెఆర్.నాయుడు, ఆదినారాయణ, ఆర్.శ్రీను, పి.విజయ, కొండమ్మ, కె కుమారి, రాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మూడో రోజు సమ్మెలో భాగంగా జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయం ఎదుట చెవిలో పువ్వులతో మున్సిపల్ కార్మికులు నిరసన ధర్నా చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ జంక్షన్ నుండి సిఐటియు కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గాజువాక జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో సిపిఎం కార్యదర్శులు గొలగాని అప్పారావు, ఎం.రాంబాబు, గొల్ల రాము, నక్క నాగరాజు, గణేష్, మీనాక్షి, కుమారి, కె వి రమణ, కోరి అప్పలరాజు, పై చిన్నారావు, పాల్గొన్నారు.

పిఎం పాలెం : మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా జోనల్ కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద చెవిలో పువ్వులు పెట్టుకొని కార్మికులు నిరసన చేపట్టారు ప్లకార్డులు ప్రదర్శించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు సిఐటియు మధురవాడ జోన్ ఉపాధ్యక్షులు సిహెచ్ శేషుబాబు, యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి ఎంవి ప్రసాద్ మాట్లాడుతూ, కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. సిఐటియు జోన్ ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు, యూనియన్ నాయకులు జి కిరణ్ ,బి నరసింగరావు, ఎం సుశీలమ్మ, వి సంధ్య, పి జాన్, క్లాప్ వాహనాల యూనియన్ నాయకులు ఎస్‌చిన్న, కె.సన్ని, బి అప్పలరెడ్డి, ఎం రాజు,ఎ.అశోక్ పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు . చీమలాపల్లిలో మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరంలో సిఐటియు నేత వెంకటరెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. పాదయాత్రలో,ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి జగన్‌ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం తప్పదని హెచ్చరించారు.

తగరపువలస : మున్సిపల్ కార్మికుల మూడోరోజు సమ్మెలో భాగంగా జివిఎంసి ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన తగరపువలసలో స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా జంక్షన్ వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, సురేష్, శ్రీను, వెంకట్ పాల్గొన్నారు. ఈ సమ్మెకు జనసేన ఒకటోవార్డు అధ్యక్షులు పరిమి భువనేశ్వరి మద్దతు తెలిపారు.

వేపగుంట : పారిశుధ్య కార్మికుల సమ్మెలో భాగంగా జివిఎంసి ఎనిమిదో జోన్ డంపింగ్‌యార్డుకు వెళ్లే మార్గంలో టెంట్ వేసి నిరసన చేపట్టారు.సిఐటియు నేత పి.వెంకటరెడ్డి టెంట్‌లో కూర్చొని నినాదాలు చేస్తూ సంఘీభావం ప్రకటించారు.

మధురవాడ : మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా 7,8 వార్డు కార్యాలయాల వద్ద వంటావార్పు నిర్వహించారు .ప్రైవేట్ ఒప్పంద కార్మికులతో కంపర్ట్ బిన్ వాహనాలు, కంటైనర్ వాహనాలలో చెత్త తరలించేందుకు మున్సిపల్ అధికారులు యత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. సిఐటియు నేతలు ఎస్ రామప్పుడు, బి రాంబాబు, కెరాజు, ఎస్ లక్ష్మి, ఎస్ లక్ష్మి, పి సుజాత, నక్క అప్పారావు ఎల్ కృప, జి నూకరెడ్డి, కృష్ణవేణి, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివియంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ఆరిలోవ కాలనీ సీవేజ్ ప్లాంట్ వద్ద ధర్నా నిర్వహించారు. అక్కడే వంటా వార్పు చేసి, రోడ్డుపైనే మధ్యాహ్నం భోజనం చేసారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ వరప్రసాదరావు, సిఐటియు నాయకులు శంకరరావు, గణపతి, బి.రత్నం, కనకరాజు, ఈశ్వరరావు, రాజశేఖర్, భవాని పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: పట్టణంలో మున్సిపల్ కార్మికుల సమ్మె మూడో రోజున సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, ఎన్నికల్లో సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులు శ్రీను, రాజు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె మూడో రోజు కొనసాగింది. జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద గురువారం మోకాళ్ళ మీద కూర్చుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్ వర్కర్లు అందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మాల రాము, నిమ్మకాయల అజయ్, నూకరాజు, శివకుమార్, సంతోష్ పాల్గొన్నారు.

భూహక్కు చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

ప్రజాశక్తి -గాజువాక : ప్రజల ఆస్తులకు తీవ్రనష్టం కలిగించే భూయాజమాన్య హక్కు చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. దీన్ని నిరసిస్తూ గురువారం గాజువాక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు కాంప్లెక్స్ ముందు న్యాయ వాదులు చేపట్టిన నిరసన దీక్షలను అసోసియేషన్ అధ్యక్షులు కెవి.స్వామి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆస్తులకు నష్టం కలిగించడంతోపాటు వాటికి రక్షణ, భద్రత లేకుండా చేస్తోందన్నారు. భూవ్యవహారాలకు సంబంధించి న్యాయ వ్యవస్థల అధికారాలన్నీ రెవెన్యూకు బదలాయించడం దుర్మార్గమన్నారు. దీనిపై ప్రజలంతా అవగాహన కలిగి వ్యతిరేకించాలని, న్యాయవాదులు చేపడుతున్న ఆందోళనకు సహకరించాలని కోరారు. నిరసన దీక్షల్లో సీనియర్ న్యాయ వాదులు ఎం. నరేంద్ర, ఆదిలక్ష్మి, సుబుద్ధి కూర్చున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి బివిఎం.కృష్ణ , సీనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

మురళీమోహన్‌కు ఐఎంఎ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మురళీమోహన్

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఎ)కు అందించిన సేవలకుగాను ఐఎంఎ విశాఖపట్నం కోశాధికారి మురళీమోహన్ ప్రశంసా పురస్కారం అందుకున్నారు. గురువారం తిరువనంతపురంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పాల్గొన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ సమావేశంలో అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శరద్‌కుమార్ అగర్వాల్, కేరళప్రెసిడెంట్ డాక్టర్ ఆర్‌వి.అశోకన్ నుంచి ఈ పురస్కారాన్ని స్వీకరించారు. సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, పూర్వ డీన్ డాక్టర్ రాయపు రమేష్‌బాబు, హెడ్ క్వార్టర్స్ సిజిపి డాక్టర్ జయేష్ లేలే పాల్గొన్నారు

కేలండర్ ఆవిష్కరణ

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న రామకృష్ణారెడ్డి, వీరారెడ్డి

ప్రజాశక్తి -సీతమ్మధార : శ్రీలక్ష్మీ వెంకటేశ్వర మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ కేలండర్‌ను సొసైటీ సభ్యులతో కలిసి వైసిపి సీనియర్ నేత సత్తి రామకృష్ణారెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా తమ సొసైటీ తరపున కేలండర్లు ముద్రించి, ప్రజలందరికీ సొసైటీ తరపున ఇస్తామన్నారు. కార్యక్రమంలో సత్తి వీరారెడ్డి. సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించిన మద్రాస్ హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి- సింహాచలం : సింహాద్రి అప్పన్నను మద్రాస్ హైకోర్టు జస్టిస్ సివి కార్తికేయన్ దంపతులు గురువారం దర్శించుకున్నారు వీరికి ఆలయ పర్యవేక్షణాధికారి రమణ, పిఆర్‌ఓ నాయుడు స్వాగతం పలికారు. ఆలయంలో పూజలు అనంతరం తీర్థప్రసాదాలను, స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

అవంతిలో జాబ్ మేళా ప్రారంభం

జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న వైవి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -తగరపువలస : ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జాబ్ మేళా ప్రారంభమైంది. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనకు సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ, 35 కంపెనీల్లో, 2,500 ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

విశాఖ, ఐఆర్‌ఎస్‌ఎంఇ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, లిఖిత, మౌఖిక పరీక్షలు, గ్రూప్ డిస్కషన్ ద్వారా పారదర్శకంగా ఎంపికలు జరుగుతాయన్నారు. ఎపిఎస్ఎస్‌డిసి జిల్లా అధికారి కె.సాయికృష్ణ చైతన్య మాట్లాడుతూ, ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాను శుక్రవారం మేళా ముగింపు రోజున ప్రకటిస్తామన్నారు టెక్నికల్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, కమ్యునికేషన్ స్కిల్స్, ప్రాక్టికల్ నాలెడ్జ్‌పై నిరుద్యోగ యువత దృష్టి పెట్టాలని పలు సంస్థల ప్రతినిధులు సూచించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, అవంతి ఇంజనీరింగ్, ఠిసెర్స్, డిగ్రీ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ బి మురళీకృష్ణ, గోవిందరావు, రామకృష్ణ, రాజు, డైరెక్టర్లు డాక్టర్ ఎ.చంద్రశేఖర్, రాఘవరావు, అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు

ఎక్కడికక్కడే చెత్త కుప్పలు!

క్షీణిస్తున్న పారిశుధ్యంతో ప్రజల తిప్పలు

మున్సిపల్ సమ్మె విరమణ చర్యలకు వినతి

మెయిన్‌రోడ్డులో పేరుకుపోయిన చెత్తకుప్పలు

ప్రజాశక్తి- పెందుర్తి : మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మెతో జివిఎంసి 93, 94, 95,95, 97 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. వీధుల్లోనే కాకుండా మెయిన్ రోడ్‌లో పలుచోట్ల చెత్తకుప్పలు చిందరవందరగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులతో సంప్రదింపులు జరిపి, సమ్మె విరమణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కార్మికులు ఎన్ని రోజులు విధుల్లోకి రాకపోతే అన్ని రోజులు చెత్తను ఇలాగేనా వదిలేస్తారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించాలని విఆర్ఎల ధర్నాలు

అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి

ప్రజాశక్తి -అనకాపల్లి

గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్ఎ) సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ ముందు విఆర్ఎలు ధర్నా చేశారు. వంటా వార్పు చేసి నిరసన తెలిపారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు సంఘీభావం తెలియజేసి మాట్లాడారు. విఆర్ఎలు ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి రెవెన్యూ పరంగా ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. పేరుకే పార్ట్ టైం ఉద్యోగులు కానీ రాత్రి పగలు తేడా లేకుండా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017 మార్చి 24వ తేదీన ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి వీఆర్ఎల దీక్ష శిబిరంలోకి వచ్చి అధికారంలోకి రాగానే వీఆర్ఎల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళు దాటినా నేటికీ వీఆర్ఎల ఏ ఒక సమస్యను పరిష్కారం చేయలేదన్నారు. విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రవి కుమార్, ఎన్.గంగాధర్ మాట్లాడుతూ విఆర్ఎలను ప్రభుత్వ ఉదోగ్యులుగా గుర్తించాలని, పేస్కేల్ వర్తింపచేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ విఆర్ఎలుగా నియమించాలని, ఖాళీగా ఉన్న విఆర్ఒ, వాచ్‌మెన్, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్, జీప్ డ్రైవర్ పోస్టులలో 30 శాతం ఉన్న పర్సెంటేజ్‌ని 70 శాతానికి పెంచి విఆర్ఎలతో భర్తీ చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన 500 డిఎను 2018 జూన్ నుండి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సంతోష్, డెవిడ్, పి.సరేంద్రర్, శాంతి కుమారి, టి. సింహాచలం, జి.పరదేశినాయుడు, వై.అప్పారావు, రమణ, పెద్ద ఎత్తున వీఆర్ఏలు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్ఎ) ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) గౌరవాధ్యక్షుడు పి.వెంకటరావు, అధ్యక్షులు ఎ.సత్యం మాట్లాడుతూ, గ్రామ రెవెన్యూ సహాయకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. డిఎ రికవరీ జిఒ రద్దు చేయాలని, రికవరీ డిఎను విఆర్ఎల ఖాతాలో జమచేయాలని, వేతనాలు రూ.26 వేలకు పెంచాలని కోరారు. జనవరి 5వ తేదీ లోపు సమస్యలు పరిష్కరించకుంటే విజయవాడలో జనవరి 5న ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, నాయకులు కెఎ.సూర్యనారాయణ, పి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విఆర్ఏలు

డిఆర్ఒకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

అంగన్వాడీ కేంద్రాలను పాఠశాలలకు
అటాచ్ చేయడం సరికాదు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ప్రాథమిక పాఠశాలలకు అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలను అటాచ్ చేయడం సరైన విధానం కాదని అనకాపల్లి జిల్లా ఫ్యాప్టో నాయకులు గొంది చిన్నబ్బాయి, కేకేఎల్ఎన్ ధర్మారావు, ఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. ఈ మేరకు వినతి పత్రాన్ని డిఆర్ఓ దయానిధికి అనకాపల్లిలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన చేస్తున్నారని, వారి సమస్యలను పరిష్కారం చూపని ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలను ప్రాథమిక పాఠశాలలకు అటాచ్ చేయడం దారుణమన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో పాటు అంగన్వాడీ పిల్లలకు మధ్యాహ్న భోజనం కల్పించాలని ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వై శ్రీనివాసరావు, ఎన్. సన్యాసినాయుడు, మధు కృష్ణ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అసకపల్లి పంచాయితీ శివారు ఎరుకు నాయుడుపాలెం రెవిన్యూ పరిధి సర్వే నెంబర్ 87లో ఉన్న బూర్జ చెరువులో అక్రమ నిర్మాణాన్ని అధికారులు గురువారం తొలగించారు. ఈ చెరువు విస్తీర్ణం11.85 ఎకరాలు కాగా, దీనిని ఆనుకొని ఉన్న జిరాయితి భూమిలో పౌల్ట్రీ షెడ్ నిర్మించిన వారు చెరువు భూమికి నిర్మాణం చేసినట్లు స్పందనలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్నట్లు ఆర్ ఐ వీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఈ జి.రామలక్ష్మణ, వీఆర్వో విజయశ్రీ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం అన్యాయం

ప్రజాశక్తి -రాంబిల్లి : మండలంలోని పెదకలవలపల్లిలో వ్యవసాయ భూముల్లో రైతులకు ప్రత్యామ్నాం చూపకుండా ఎన్ఎఒబి అధికారులు ప్రహరీ నిర్మాణం చేయడం అన్యాయమని బాధితులు వాపోయారు. ప్రహరీ నిర్మాణ ప్రాంతంలో వారు చేపట్టిన ఆందోళన 63 రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎంపీటీసీ రావి దేముళ్ల మాట్లాడుతూ రైతుల సమస్యలను గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి అధికారులు తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎలమంచిలి శేషు, రావి చినభుల్లి, సూరకసుల రాజుబాబు, గొలగని ఆదినారాయణ, రావి మంగ, రావి కొత్త బాబు, నాగమణి బాధితులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రతి ఒక్కరూ ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు బ్యాంకుల ద్వారా అనేక పథకాలు తీసుకొస్తున్నట్లు ఆర్బిఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్కే హనుమకుమారి తెలిపారు. గురువారం మండలంలోని చౌడువాడ శివారు పాచిలవానిపాలెం గ్రామంలో ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పొదుపు అలవాటు చేసుకోవాలన్నారు. బ్యాంకులు అనేక ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు అందజేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీవీబీ మేనేజర్ శ్రవణ్ బాబు, అధికారులు కే సత్యనారాయణ, టి ఆనంద్, వైస్ ఎంపిపి రొంగలి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - యలమంచిలి : రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు ప్రారంభించామని యలమంచిలి శాసన సభ్యులు ఉప్పలపాటి రమణమూర్తి రాజు తెలిపారు. గురువారం షేకిళ్లపాలెంతో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు అమ్మే సాధారణ రకం మద్దతు ధర రూ. 2,183కు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ అధ్యక్షులు సుకుమార్ వర్మ, ఎంపిపి బొదెపు గోవిందరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు రవిప్రకాష్, వ్యవసాయాధికారి మోహనరావు, వైఎంసి అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర, గ్రామ సర్పంచ్ రాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

1న పిఎసిఎస్ శత వార్షికోత్సవం

ప్రజాశక్తి- మునగపాక : మండలంలోని నాగులపల్లి పిఎసిఎస్ శత సంవత్సర వార్షికోత్సవ వేడుకలను జనవరి 1న జరుగుతున్నాయని, వాటిని జయప్రదం చేయాలని ఆ సంఘ అధ్యక్షులు మల్ల ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సంఘ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన కీర్తిశేషులు మల్ల రామునాయుడు కృషితో స్థాపింపబడిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం 2024 జనవరి 1 నాటికి 100 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకోనున్నదని తెలిపారు. కార్యక్రమంలో సంఘ సీఈవో మల్ల స్వామి చంద్ర నాయుడు డైరెక్టర్స్ నరాల శెట్టి బాబురావు, కోయిలాడ ఎర్రయ్య నాయుడు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

భూమి పాస్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలో గల ఐతంపూడిలో రైతులకు జగనన్న భూ రక్ష కార్యక్రమంలో భాగంగా నూతనంగా ప్రభుత్వం మంజూరు చేసిన పాసు పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి దొండ రాంబాబు, స్థానిక సర్పంచ్ పెద్దాడ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు జోగా కొండబాబు, దాకారపు నాగరాజు, పి.భీమవరం సర్పంచ్ పినపొలు రామనాయుడు, కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు విజయరామరాజుపేట సర్పంచ్ ఎల్లపు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధిక ప్రసవాలు జరగాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి, చిత్రంలో జిల్లా అధికారులు

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో జరిగే ప్రసవాలు ఎక్కువగా ప్రభుత్వ డాక్టర్ల పర్యవేక్షణలో ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరగాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వైద్య ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కేసులు కూడా ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రులలోనే చికిత్స చేయాలన్నారు. కష్టతరమైన కాన్పుకు అవకాశం ఉండే గర్భవతులను ముందుగానే ఆసుపత్రులకు తీసుకురావాలన్నారు. స్టాఫ్ నర్స్, ఆశ కార్యకర్తలు వారికి ముందస్తు చికిత్సలను, జాగ్రత్తలను గూర్చి అవగాహన కలిగించాలని సూచించారు. తల్లి బిడ్డలు క్షేమంగా ఉండే సుఖప్రసవాలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తగిన చికిత్స పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. డాక్టర్లు వైద్య సిబ్బంది గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ హేమంత్, డిసిహెచ్ఎస్ డాక్టర్ యస్.శ్రీనివాసరావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి అనంతలక్ష్మి, ఆంధ్ర మెడికల్ కాలేజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యం.యమున, అనకాపల్లి నర్సీపట్నం జిల్లా ఆసుపత్రుల సూపరిండెంట్లు, చోడవరం, మునగపాక, నర్సీపట్నం, గోలుగొండ, ఎలమంచిలి ప్రాంతీయ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు ఇతర డాక్టర్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి- అనకాపల్లి : భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు భవన నిర్మాణ కార్మిక సంక్షేమానికే ఖర్చు చేయాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లైములు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం చంటి, రామకృష్ణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా నాయకులు కే సోమినాయుడు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిఆర్ఓ దయానిధికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

ఖైదీలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి -అనకాపల్లి : భీశెట్టి సత్యనారాయణ, వెంకట త్రివేణిల పుత్రిక తనూజ జన్మదినం సందర్భంగా స్థానిక సబ్ జైల్‌లో గురువారం ఖైదీలకు రూ.10 వేలు విలువగల 50 దుప్పట్లు, పండ్లు జైల్ సూపరింటెండెంట్ వై.ఎన్.గణేశ్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత జైల్ హెడ్ వార్డర్ బల్లా నాగభూషణం, కర్రి గణేశ్, కర్రి లావణ్య, దేదీపు సాయి, కర్రి ఘణ చరిత్ర, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

పిఎసిఎస్‌లో లాకర్స్ ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని స్థానిక దుర్గమాంబ పిఎసిఎస్‌లో లాకర్స్‌ను చైర్మన్ కాపుశెట్టి శేషబాబు గురువారం ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలో లాకర్స్ కావలసిన వారు అడ్వాన్స్ చెల్లించి తీసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో డిసిసిబి సీఈఓ డి.వి.ఎస్.వర్మ, ఆప్కోబ్ ఎంజీఎం రాజు, డిసిసిబి జీఎం అప్పలరాజు, పెందుర్తి బ్రాంచ్ మేనేజర్ విధ్యామాల, పల్లా కృష్ణ, సిఈఓ గొంప రమణ, బి.మంజుల, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని కొరువాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులు 28 మందికి అమ్మ చారిటబుల్ ట్రస్ట్, 1993-94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.కమల కుమారి, ట్రస్ట్ చైర్మన్ గొప వెంకట రావు, ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు కిరణ్ కుమార్, గుప్తా, విద్యార్థులు పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని అప్పలరాజపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులు 56 మందికి వై2కె బ్యాచ్ (1999-2000) పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. హెచ్ఎం విఎస్ఆర్.కల్యాణి, ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు కిరణ్ కుమార్, గుప్తా, చెల్లయ్యమ్మ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మ చారిటబుల్ ట్రస్తు ఆధ్వర్యాన మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

మెగా డిఎస్‌సి ప్రకటించాలని డివైఎఫ్ఐ ఆందోళన

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో నిరుద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని కోరుతూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నిరుద్యోగ యువకులతో కలిసి నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓకి వినతిపత్రం అందజేశారు. అనంతరం డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో 6లక్షల పైగా నిరుద్యోగులు బిఈడి, టిటిసి పూర్తి చేసి కోచింగ్ సెంటర్లో సంవత్సరాలుగా కాలం వెల్లదీస్తున్నారని, ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందా అని ఎదురు చూస్తున్నారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం నిరాశే మిగిల్చిందని వాపోయారు. కనీసం ఇప్పుడైన ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వానికి నిరుద్యోగులు పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. లేకుంటే నిరుద్యోగులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అల్లు రాజు, జిల్లా నాయకులు కే. సోమునాయుడు, పి.మోహన్, కిషోర్, నిరుద్యోగులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు, నిరుద్యోగులు

మినీ మేనిఫెస్టోను చూపుతున్న దృశ్యం

టిడిపి మినీ మేనిఫెస్టోపై అవగాహన

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని నేతవాని పాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టో, బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు వియ్యపు రామారావు, వియ్యపు ముత్యాల నాయుడు, అయ్యప్ప బర్నేకాన నాయుడు, తదితరులు పాల్గొన్నారు

చోడవరం : బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం ముద్దుర్తి గ్రామంలో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బత్తుల తాతయ్య బాబు ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో వివిఎస్ఎన్.మూర్తియాదవ్, బొడ్డేడ నాగ గంగాధర్, కనిశెట్టి మత్స్యరాజు, శిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, దేవర రవి కుమార్, పోతల రవి పాల్గొన్నారు.

వంట పాత్రల పంపిణీ

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్‌లో జగనన్న గోరు ముద్ద భాగంగా గురువారం వంట పాత్రలు పంపిణీ చేసారు. వీటిని ఎంపీటీసీ లగిసెట్టి భవానీ గణేష్ అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి సుమన్, పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణ రావు, వంట నిర్వాహకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆటల పోటీలు

ప్రజాశక్తి-పరవాడ : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 3వ రోజు గురువారం పరవాడ మండలం రావాడ సచివాలయం పరిధిలో షటిల్ కాక్ పోటీలను వైసిపి మండల అధ్యక్షుడు కోన రామారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రావాడ వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ కెవి.రాజు, కొలగాని సాంబ, పంచాయతీ సెక్రటరీ అనూరాధ, డిఎ వెంకట రమణ, విఆర్ఓ భుజంగరావు, టి హరి, క్రీడాకారులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ జడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బాక్సింగ్ కోచ్ షేక్ రహ్మాన్ గురువారం పరిశీలించారు. అక్కడ చేసిన ఏర్పాట్లును పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, ఎంపీడీవో ప్రసాద్, పాఠశాల హెచ్ఎం అప్పారావు, పంచాయతీ కార్యదర్శి నక్క రామనాయుడు, ఎంఈఓ 2 డివిడి ప్రసాద్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా ఆడుదాం ఆంధ్రా

కోటవురట్ల: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం జరిగిన వివిధ క్రీడా పోటీలు మొక్కుబడిగా సాగాయి. మండల కేంద్రంలో పరిపాలన అధికారి చంద్రశేఖర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనేవారు అధిక శాతం వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఉండటం పట్ల ప్రతిపక్ష నాయకులు పలు విమర్శలు గుప్పిస్తున్నారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో మొక్కుబడిగానే సాగుతున్నట్లు ఆరోపిస్తున్నారు.

కీడలను ప్రోత్సాహించడమే లక్ష్యం

గాజువాక : క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు 87వ వార్డు వైసిపి అధ్యక్షులు కోమటి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఎరుకలవీధి గణేష్ నగర్ సచివాలయాలకు సంబంధించి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను, గాజువాక ఆదర్శ గ్రౌండ్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో బొడ్డ గోవింద్, వాడపల్లి రామచంద్ర రాజు, కోమటి రమాదేవి, జెర్రిపోతుల ఈశ్వరరావు, బుగిడి రామలక్ష్మి, కణితి ప్రసాద్, బొడ్డు సుమంత్, కాండ్రేగుల మనోహర్ పాల్గొన్నారు.

తగరపువలస: 'ఆడుదాం ఆంధ్రా'లో భాగంగా అమనాంలో క్రికెట్, దాకమర్రిలో వాలీబాల్ పోటీలను ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణ రాజు (వాసురాజు)ప్రారంభించారు. ఆయా పంచాయితీల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు

భీమునిపట్నం : మండలంలోని మూలకుద్దులో 'ఆడుదాం ఆంధ్రా' క్రికెట్ టోర్నమెంట్‌ను వైసిపి జిల్లా పంచాయతీరాజ్ విభాగం ఉపాధ్యక్షులు కొల్లి కోటిరెడ్డి ప్రారంభించారు. రేఖవానిపాలెం సర్పంచి సమ్మిడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కె రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు

బకాయిలు విడుదలకు లైన్ క్లియర్

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం గోవాడ సుగర్స్ పరిధిలోని చెరకు రైతులకు చెల్లించాల్సిన బకాయిలు విడుదలకు లైన్ క్లియరైనట్లు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం కూడా బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ విడుదల చేసిందన్నారు. గోవాడ సుగర్స్ చెరకు రైతులకు, కార్మికుల జీతాల బకాయిలకు, ఫ్యాక్టరీ నిర్వహణకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 12.3 కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ నవంబర్ 16న జీవో నెంబర్ 1891 విడుదల చేసినట్లు చెప్పారు. దీంతో కావాల్సిన బిల్లులన్నీ ప్రభుత్వానికి సమర్పించడం జరిగిందన్నారు. ఇటీవల చింతపల్లి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి మరోసారి ఈ గ్రాంట్ విషయం తీసుకువెళ్లగా స్పందించిన వెంటనే అక్కడున్న అధికారులను ఆదేశించి వెంటనే చర్యలు చేపట్టాలని చెప్పారని తెలిపారు. ఈ నెల 29 నుంచి గోవాడ షుగర్ ఫ్యాక్టరీ గానుగట ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు కార్మికులకు త్వరలో బకాయిలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. మండలంలో గోవాడ గ్రామంలో ఆడుదాం ఆంధ్ర క్రీడలను ప్రారంభించారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, దొడ్డి వెంకటరావు, ఎంపీడీవో ఎసిడి శ్యామసుందర్, సూర్యనారాయణ, వెంపలి ఆనందేశ్వరరావు, ఒరుగంటి నెహ్రూ, దేవరపల్లి సత్య, బేరా సత్యారావు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

సమస్యలపై మిడ్డేమీల్స్ కార్మికుల ధర్నా

ధర్నా చేస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులు

ప్రజాశక్తి -కశింకోట : తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్మికులు గురువారం ర్యాలీ నిర్వహించి, కశింకోట ఎంఈఓ ఆఫీస్ ఎదుట ధర్నా చేశారు. ఎంఈఓ-2 సూర్యనారాయణకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సూర్యలక్ష్మి శ్రీదేవి, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మూడు నెలలుగా ఉన్న పెండింగ్ బిల్లులు, వేతనాలు తక్షణమే చెల్లించాలని ,ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ,యూనిఫారం ఇవ్వాలని, స్వచ్ఛంద సంస్థలకు పథకాన్ని అప్పజెప్పు వద్దని కోరారు.

నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : నాయీ బ్రాహ్మణులను రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని, తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో గురువారం నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా 1989లో నందమూరి తారక రామారావు నాయి బ్రాహ్మణుల ఆర్థిక సంస్థను ఫెడరేషన్ ఏర్పాటు చేసి జీవో నెంబర్ 250 ద్వారా ఇల్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అనంతరం జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా కోర్ కమిటీ కన్వీనర్‌గా పుల్లేటికుర్తి రమేష్, సభ్యులుగా చీపురుపల్లి సత్తిబాబు, అద్దంకి బాబూరావు (నర్సీపట్నం), దొడ్డవరపు ఈశ్వరరావు (చోడవరం), తణుకు శివాజీ రాజు (పాయకరావుపేట), కాదులూరి శ్రీనివాసరావు (మాడుగుల), కాదులూరు శంకర్రావు (యలమంచిలి), కొమ్మన రామ్ కుమార్ (అనకాపల్లి)ను నియమించారు.

జనవరి 22న ఓటర్ల జాబితా ప్రచురణ

ప్రజాశక్తి- అనకాపల్లి : 2024 జనవరి 22వ తేదీన జిల్లా ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్ శెట్టి తెలిపారు. గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు అందిన క్లైములు, అభ్యంతరాలు పూర్తిగా పరిష్కరించడం జరిగిందన్నారు. ఇంకా ఏమైనా అభ్యంతరాలు, నమోదులు ఉన్నట్లయితే జనవరి 12వ తేదీలోగా సమర్పించాలన్నారు. వాటిని 17వ తేదీలోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాలోని 1529 పోలింగ్ కేంద్రాలలో 12 లక్షల 57 వేల 707 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు లక్ష్మీదేవి, ఎస్ఎ తులసీరామ్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బొలిశెట్టి శ్రీనివాసరావు పి సోమేశ్వరరావు పసుపులేటి రామకష్ణ ఎస్.వి.వి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల జీతాలు బకాయిలపై ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ కార్మికులకు నాలుగు నెలల జీతాలు బకాయి ఉండగా గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద ఏఐటియుసి జిల్లా కన్వీనర్ వై.ఎన్. భద్రం ఆధ్వర్యంలో జరిగిన ధర్నా నిర్వహించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పంచాయతీ కార్మికులకు వెంటనే రెండు నెలల జీతాలు అంద చేయడానికి అంగీకరించారు. మిగతా రెండు నెల జీతాలు జనవరి నెలలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. జనవరిలో జీతాలు చెల్లించకుంటే సమ్మెలోకి వెళ్తామని పంచాయతీ కార్యదర్శి కార్మికుల స్పష్టం చేశారు. ఈ ధర్నాలో కలిగొట్ల నాయుడు, చెవెటినేస్తాలు, పొట్నూరు గణేష్, కారు సత్తిబాబు, తోట నాగేశ్వరరావు, పెదపూడి నూకరాజు, జయ, మంగ, లక్ష్మీ, రమణమ్మ, నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సబ్ సెంటర్‌లో సౌకర్యాలు కల్పిస్తా

ప్రజాశక్తి-కశింకోట : మండలం వెదురుపర్తి గ్రామంలో గురువారం వైసిపి అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ పర్యటించారు. ముందుగా గ్రామంలో శివాలయంలో శివున్ని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం గ్రామంలో సచివాలయం, ప్రభుత్వ పాఠశాలలు, హెల్త్ సబ్ సెంటర్ సందర్శించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన సొంత నిధులతో సబ్‌సెంటర్‌లో సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా కాంగ్రెస్138వ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి -అనకాపల్లి : భారత జాతీయ కాంగ్రెస్ 138వ ఆవిర్భావ దినోత్సవం అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ జెండాను న్యాయవాది, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఐ.ఆర్. గంగాధర్ ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశాన్ని పునాదుల నుండి పునర్నిర్మాణం చేసి అగ్రరాజ్యాల సరసన నిల్పిందని, నేడు బిజెపి మతోన్మాద పాలకులు దేశాన్ని తిరోగమన దిశగా పాలిస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని ఆరోపించారు. బిజెపి నుండి దేశాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అవినాష్ ఇళ్ల, ఐవీఎస్. ప్రసాద్, కట్టుమూరి నూకఅప్పారావు, టేకుపూడి సంతోష్, ఎగ్గాడ భాస్కర్, వీరేశరపు రాంప్రసాద్, సనేడ గజ్జులు, నాయుడు, దాసరి సంతోష్ పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్ఆర్ నాయుడు, గొరుపూటి శ్రీనివాసరావు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

నక్కపల్లి : నక్కపల్లి లో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకను ఆ పార్టీ సీనియర్ నేత మేడేటి శంకర్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ, దేశాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ యూనియన్ అధ్యక్షులు నానాజీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతకాయల సింహాద్రి, ప్రగడ చక్రి, నీలి అశోక్, బత్తుల రఘు, మొల్లేటి చిన్ని, గంగిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.మాడుగుల నియోజకవర్గంలో కాంగ్రెస్ హయాంలోనే అనేక జలాశయాలు నిర్మించి రైతులకు వెన్నెముకగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డాది కోటేశ్వరరావు, పడాల కొండలరావు, ఏసు రాజు, జోగారావు, వేచాలపు రవి, బొడ్డు రామకృష్ణ పాల్గొన్నారు.

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:పట్టణంలో మున్సిపల్ ఛైర్పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం వాడివేడిగా జరిగింది. ముందుగా అజెండాను చదివి వినిపించారు. టిడిపి కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ, రోడ్డు విస్తరణ ఎన్ని అడుగులు చేస్తున్నారో తీర్మానం బయట పెట్టాలని డిమాండ్ చేశారు.అభివృద్ధి పనులను టిడిపి కౌన్సిలర్లు అడ్డుకుంటున్నారంటూ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ ఆధ్వర్యంలో వైసిపి కౌన్సిలర్లు ఎదురు దాడికి దిగారు. జనసేన పార్టీ కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ, నర్సీపట్నం మున్సిపాలిటీ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి వరకు రోడ్డు విస్తరణపై ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 40 అడుగులకు విస్తరించాల్సి ఉండగా 30 అడుగులకు ఎందుకు కుదించారని ప్రశ్నించారు.రోడ్డు విస్తరణ కుదించడం వల్ల ప్రజలు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిబాబు, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాటలతో ఘర్షణ పడుతున్న ఇరు పార్టీల సభ్యులు

జనసేన రూరల్ కమిటీలో చోటు

ప్రజాశక్తి - మాడుగుల: విశాఖ జిల్లా జనసేన రూరల్ కమిటీలో మాడుగుల నియోజకవర్గం నుండి ముగ్గురు సభ్యులను ఎన్నుకున్నారు. గురువారం విశాఖ జిల్లా రూరల్ కమిటీ సభ్యులుగా మాడుగుల నియోజకవర్గం నుండి వీర సురేఖ, గుమ్మడి శ్రీరామ్ లను, అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా మాడుగుల కు చెందిన రొబ్బ మహేష్ ను నియమించినట్లు మాడుగుల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త రాయపరెడ్డి కృష్ణ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లాల జనసేన అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు మరియు జనసేన జిల్లా నాయకుల సమక్షంలో వీరి ప్రమాణస్వీకారం నిర్వహించినట్లు రాయపరెడ్డి కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాలుగు మండలాల నుండి జనసేన ముఖ్య నాయకులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

మాట్లాడుతున్న శాస్త్రవేత్త

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-గొలుగొండ: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను సకాలంలో పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను సాగు చేయవచ్చని బిసి కృషి విజ్ఞాన కేంద్రం సేద్య శాస్త్రవేత్త డాక్టర్ వాన ప్రసాదరావు అన్నారు. గొలుగొండ మండలం కెడిపేట అల్లూరి పార్కులో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి లు సాధించ వచ్చునని వివరించారు.

కేన్సర్ రోగులకు కీమో థెరపీ సేవలు

డిసిహెచ్ శ్రీనివాస్

ప్రజాశక్తి -నక్కపల్లి:అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో జనవరి నెల నుంచి కేన్సర్ రోగుల కోసం కీమో థెరపీ సేవలు అందుబాటులోకి వస్తాయని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త (డిసిహెచ్) డాక్టర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. నక్కపల్లి సిహెచ్‌సిని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి ఆస్పత్రిలో కీమో థెరపీకి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని, పనులు ముగింపు దశలో వున్నాయని తెలిపారు. జనవరి నెల నుంచి ఈ సేవలు కేన్సర్ రోగులకు అందుబాటులో వుంటాయన్నారు. అనకాపల్లి ఆస్పత్రిలో సిసిబి (క్రిటికల్ కేర్ బ్లాక్) యూనిట్ ను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, సంబంధిత కేంద్ర మంత్రి ఈ నెల 29న అనకాపల్లి నుంచి వర్చువల్గా శంకుస్థాపన చేస్తారని తెలిపారు. సిసిబి యూనిట్ ఏర్పాటుకు దాదాపు రూ.22కోట్లు ఖర్చవుతుందన్నారు. సిహెచ్‌సిల్లో కూడా గుండె రోగులకు స్టెమీ రూములు ఏర్పాటు చేశామని, అత్యవసర సమయంలో రూ.22వేలు విలువైన ఇంజక్షన్ వారికి ఇస్తామన్నారు. జగనన్న 2.0 ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని 24 మండలాలాల్లో అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రతీ మంగళవారం 12 మండలాలు, ప్రతీ శుక్రవారం 12 మండలాల్లో గైనకాలజిస్టు, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, ప్రత్యేక వైద్య నిపుణులతో ప్రజలకుసేవలు అందిస్తామన్నారు.

పలు చోట్ల స్టడీ మెటీరియల్ అందజేత

నక్కపల్లిలో స్టడీ మెటీరియల్ ఇస్తున్న కంపెనీ ప్రతినిధులు

ప్రజాశక్తి- నక్కపల్లి: హెటిరో యాజమాన్యం అందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పదిలో మంచి ఫలితాలు సాధించాలని డిప్యూటీ డిఇఓ అప్పారావు అన్నారు.హెటిరో యాజమాన్యం నక్కపల్లి మండలంలో 1200 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను సమకూర్చింది .మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని కంపెనీ ప్రతినిధులు కల్లయ్య రెడ్డి , సుబ్బారెడ్డి ల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డిప్యూటీ డిఇఓ అప్పారావు, సర్పంచ్ నూకరత్నం, వేంపాడు పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జి మణిరాజు, ఎంఇఓ నరేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఓ అప్పారావు మాట్లాడుతూ, హెటిరో యాజమాన్యం ఎంతో విలువైన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందజేయడానికి ముందుకు రావడం శు భపరిణామన్నారు. స్టడీ మెటీరియల్ ను ఆయా పాఠశాలల హెచ్ఎం లకు అందజేశారు. 2022- 23 విద్యా సంవత్సరానికి సంబంధించి పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 21 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహన్ని అందజేశారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ, మూడు లక్షలతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను సమకూర్చడం జరిగిందన్నారు. 21 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహం కింద 6 లక్షలు అందించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్ఎంలు, కంపెనీ ప్రతినిధులు పంకజాక్షి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలో అన్ని హైస్కూళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు యుటిఎఫ్ మోడల్ పేపర్ పుస్తకాలను అందించారు. ఈ మేరకు యుటిఎఫ్ మండల కమిటీ ఆయా పాఠశాలల హెచ్ఎంలకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షుడు కాళింగ సతీష్ మాట్లాడుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో దశాబ్దాలుగా పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే స్టడీ మెటీరియల్, మోడల్ పేపర్లను నిపుణులచే తయారు చేయించి, ముద్రించి, విద్యార్థులకు పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి డి.అప్పారావు, గౌరవ అధ్యక్షులు యు.నాగభూషణం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు వితరణ

ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు సేవలపై ప్రశంసలు

సామగ్రిని ఇస్తున్న ఎంపిపి, అధికారులు

ప్రజాశక్తి-చీడికాడ:అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలోని మంచాల గ్రామానికి చెందిన మేడివాడ స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు బొడ్డు మహాలక్ష్మి నాయుడు దివ్యాంగ పిల్లలకు రగ్గులను, వాటర్ బాటిల్స్ వితరణగా అందజేశారు. వీటిని మండల ఎంపిపి జయమ్మ, దాతలు బొడ్డు వెంకటరమణ, మండల విద్యాశాఖ అధికారుల బివి. రమణ, బొంజుబాబు, తురువోలు గ్రామ సర్పంచ్‌ల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి జయమ్మ మాట్లాడుతూ, దివ్యాంగులకు రగ్గులను, వాటర్ బాటిల్స్‌ని వితరణ చేసిన మహాలక్ష్మినాయుడిని అభినందించారు. భవిత కేంద్రాల్లో ప్రత్యేకమైన శిక్షణతో పిల్లల్లో మానసికానం వికసిస్తుందని తెలిపారు. పిల్లలను ప్రతిరోజు భవిత కేంద్రానికి పంపించాలని కోరారు. మండల విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ, పిల్లలను భవితా కేంద్రాలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు దేముడుబాబు, సరస్వతి, అనురాధ, జగన్నాథనాయుడు, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోటవురట్ల: ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం మండల సమావేశం మందిరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, దివ్యాంగుల ప్రభుత్వం సహా అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. మండల పరిషత్ పరిపాలన అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ, దివ్యాంగులకు ప్రత్యేక స్థానం కల్పించాలన్నారు. దివ్యాంగులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు గంగు నాయుడు మాట్లాడుతూ దివ్యాంగులకు వ్యక్తిగత రేషన్ కార్డు అందజేయాలన్నారు.



నగదు ఇస్తున్న నాయకులు

బాధితునికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-యస్.రాయవరం:అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి జనసేన ఆపన్న హస్తం అందించింది. మండలంలోని వాతాడ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మురికుర్తి రాజు కొంతకాలంగా ఇంటివద్దనే ఉంటున్నాడు.విషయం తెలుసుకున్న తిమ్మాపురం గ్రామానికి చెందిన జనసేన సీనియర్ నాయకులు శానాపతి బాబూరావు మాష్టారు నేతృత్వంలోని జనసైనికులు గతంలో దాతల సహకారంతో నగదు అందించిన సమయంలో వీల్ చైర్ లేక రూ. 5000 ఇస్తానని మాట చెప్పారు. ఆ మాటకు కట్టుబడి వాతాడ గ్రామ వార్డు సభ్యులైన గెద్దాడ దుర్గారావు చేతుల మీదుగా నగదు అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు దమ్ము రాజు కుమార్, దమ్ము దుర్గ ప్రసాద్, శ్రీను, ప్రసన్న కుమార్, రాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న గవిరెడ్డి

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-మాడుగుల:మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి 100 మంది చేరారు. గురువారం మండలంలోని బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంపై గవిరెడ్డి రామానాయుడు ఎల్.పొన్నవోలు పంచాయతీలో పాదయాత్ర చేపట్టారు. పొన్నవోలు పంచాయతీకి సంబంధించి వైసిపికి చెందిన 30 కుటుంబాలు టిడిపిలో చేరినట్లు రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల కార్యదర్శి ఉండూరు దేవుడు, వొమ్మలి సర్పంచ్ ఎస్ఎస్ నాయుడు, గాదిరాయి సర్పంచ్ పెంటకోట జగన్నాధ రావు, కాశి బాబు, శ్రీరామ్ మూర్తి, పొన్నవోలు సత్తిబాబు,తాతారావు పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన వారితో వీనస్ కోచింగ్ నిర్వాహకులు

ఆరుగురికి ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి-మాడుగుల: స్థానిక వీనస్ కోచింగ్ సెంటర్ సత్తా చాటింది. వీనస్ కోచింగ్ ఇన్స్టిట్యూట్ కరస్పాండెంట్ తాలపురెడ్డి నాగచంద్ర మాట్లాడుతూ, తిరుపతి వద్ద అమర్ రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో తమ కోచింగ్ సెంటర్‌కు చెందిన నిరుద్యోగులు ఆరుగురు ఎంపిక అయ్యారన్నారు.వీరికి 21 నెలలపాటు నైపుణ్యంతో కూడిన శిక్షణ అందించి వసతులతో పాటు భోజన సౌకర్యాలు ఏర్పాటు చేసి రూ 12 వేల గౌరవ వేతనం అందిస్తుందని నాగచంద్ర తెలిపారు. శిక్షణ పూర్తయిన వెంటనే ధ్రువీకరణ పత్రం ఇచ్చి అదే కంపెనీలో రూ.25 వేలు ప్రారంభ జీతం ఇస్తారని ఆయన తెలిపారు. హెల్త్ ఇన్సూరెన్స్, హౌస్ బెనిఫిట్స్ వంటి సదుపాయాలను కంపెనీ ఏర్పాటు చేస్తుందని నాగచంద్ర తెలిపారు.

రాష్ట్రంలో అభివృద్ధి ఏదీ? : టిడిపి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీ గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షులు తులసిరావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అరకు ఇన్చార్జి సివేరి దొన్ను దొర తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి ప్రజాధనాన్ని వృథా చేస్తుందన్నారు.

పోస్టు కార్డులతో ఉద్యమం

-సిఎం జగన్‌కు లెటర్లు - 17వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

ఎస్.రాయవరంలో..

నక్కపల్లిలో పోస్టు కార్డులను చూపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 17వ రోజుకు చేరింది. సమ్మె శిబిరాల్లో అంగన్‌వాడీలు పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. సమస్యలను పరిష్కరించాలని పోస్టు కార్డులను సిఎం జగన్‌కు పోస్టు చేశారు.

ఆర్‌డిఒ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-అనకాపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 17 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు గురువారం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. దీనికి ముందు అనకాపల్లి జిల్లా సిఐటియు కార్యాలయం నుంచి నెహ్రూ చౌక్ మీదుగా ఆర్డిఓ ఆఫీస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం ఎదు బైఠాయించారు. తమ సమస్యలపై సీఎం జగన్మోహన్ రెడ్డికి పోస్ట్ కార్డులు రాసి, పోస్టు చేశారు. అంగన్వాడీ సమస్యలను ఉత్తరాల ద్వారా మరోసారి విన్నవిస్తున్నామని, సానుకూలంగా స్పందించి తమ డిమాండ్ల పరిష్కారానికై సత్వరమే చర్యలు తీసుకోవాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు తనూజ, ఉమానారాయణమ్మ, కృష్ణవేణి, అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఉత్తరాలు

చోడవరం:అంగనవాడి వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని యూనియన్ ఆధ్వర్యంలో చోడవరం మండలంలో 150 మంది అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు గురువారం ఉత్తరాలు రాసి పోస్ట్ ఆఫీస్‌లో సీఎం క్యాంప్ ఆఫీస్ అడ్రస్‌కు పోస్టు చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్వి నాయుడు, యూనియన్ నాయకులు సూర్యకాంతం, కాంతం, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ తాసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు పోస్ట్ కార్డులు రాసి ముఖ్యమంత్రికి పోస్టు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు ఎం రమణి, సిహెచ్ దేవి, ఎం రమణి, కృష్ణవేణి, రామలక్ష్మి, శంకరమ్మ, రత్నమాల, కుమారి పాల్గొన్నారు

రాంబిల్లి : రాంబిల్లి స్థానిక తహాశీల్దార్ కార్యాలయం సమీపంలో అంగన్వాడీలు అంగన్వాడీలు ప్ల కార్డులతో నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి పోస్టు కార్డులు రాశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేముడునాయుడు, యూనియన్ నాయకులు బి.మంగ, ఎస్.సుజాత, రమణమ్మ, కామేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

మునగపాక : మునగపాకలో అంగన్వాడీలు తమ డిమాండ్లతో కూడిన పోస్ట్ కార్డులు చేత పట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ, అంగన్వాడీలు రామలక్ష్మి, జై లక్ష్మి, హేమలత, అంజలి, సరస్వతి, భవాని, ఉమా, లక్ష్మి, వెంకట సత్యవతి, తులసి లక్ష్మి, అరుణకుమారి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : తమ సమస్యలపై అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు గురువారం ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ఉద్యమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఆది, వరలక్ష్మి, అమ్మాజీ, ఈశ్వరమ్మ, చిలకమ్మ, వెంకటలక్ష్మి, జగదాంబ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన దీక్షలు 17వ రోజుకు చేరాయి. ఈ కార్యక్రమంలో ఎపి రైతు జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు, అంగన్వాడీల జిల్లా గౌరవ అధ్యక్షురాలు డోకల కుమారి, పి.భవాని పాల్గొన్నారు.

నర్సీపట్నంలో మాట్లాడుతున్న శంకరరావు

ఒంటి కాలుపై నిరసన

అచ్యుతాపురం : స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. తమ డిమాండ్లపై పోస్ట్ కార్డులు ముఖ్యమంత్రికి పోస్టు చేశారు. వీరి ఆందోళనకు కాంగ్రెస్ నాయకులు కనకాల అనంతరావు, రాహుల్, బీశెట్టి పెంటారావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి జయలక్ష్మి, రామలక్ష్మి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఫోన్ కాల్స్

సబ్బవరం : మండలం కేంద్రంలో రిలే దీక్షలు చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు ముఖ్యమంత్రికి 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ కాల్ చేసి తమ సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వివి.రమణమ్మ, ఎం. వరలక్ష్మి, పుష్ప, జగదీశ్వరి, వి.సుభాషిణి, ఎం. కనకమ్మ, జి.అరుణ కుమారి, ఎస్. రమణమ్మ, డి.భారతి, ఎ. రమణమ్మ, పి. సూరమ్మ, ఎన్. సత్యవేణి పాల్గొన్నారు.

సబ్బవరంలో 1902కు కాల్ చేస్తున్న అంగన్‌వాడీలు

నక్కపల్లి: సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడి వర్కర్స్ చేపట్టిన సమ్మె గురువారం నాటికి 17వ రోజుకు చేరింది. మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహారదీక్ష శిబిరం వద్ద అంగన్వాడి వర్కర్స్ పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, గతంలో ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా వెయ్యి రూపాయలు వేతనం పెంచి ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి లేక రాసి పోస్ట్ చేశారు.సమ్మెకు వేంపాడు ఎంపీటీసీ సభ్యులు కుంచె మధు తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, యూనియన్ నాయకులు కవిత, లక్ష్మీ రాజ్యం, మంగ లక్ష్మీ, రమణమ్మ, జయ, ఆర్‌వికె లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు .

యస్.రాయవరం: మండలకేంద్రలో సమ్మె చేపడుతున్న అంగన్‌వాడీలు పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, వెంకటలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:పట్టణంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకరరావు మద్దతు ప్రకటించారు. అంగన్వాడీల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. 17 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే కొంతమంది ఎమ్మెల్యేలు, మంత్రులు చులకనగా మాట్లాడటం సరి కాదన్నారు. సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ప్రాజెక్టు నాయకులు వి.సామ్రాజ్యం, డి.మహలక్ష్మీ, కృష్ణవేణి, శోభా, సిఐటియు కన్వీనర్ టి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

కె.కోటపాడులో మాట్లాడుతున్న నాయనబాబు

పాయకరావుపేట:స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్వాడీల నిర్వహిస్తున్న సమ్మె 17వ రోజుకు చేరుకుంది. ప్లకార్డులతో తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు.సిఐటియు మండల నాయకులు బత్తిన నాగేశ్వరరావు మాట్లాడుతూ, అంగన్వాడీలకు ఇచ్చిన మాటను సిఎం నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ఫణి, నూక రత్నం, సత్య వేణి, పలువురు అంగన్వా డీలు, సహాయకులు పాల్గొన్నారు.

కోటవురట్ల:
ఎరువారం తాసిల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించారు, సందర్భంగా ప్రభుత్వానికి పోస్టు కార్డు ద్వారా సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి లేఖలురాసి పంపుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు, కార్యక్రమంలో సంఘ నాయకులు పుష్ప, సహా కార్యవర్గ సభ్యులు అంగన్వాడి కార్యకర్తలు హెల్పర్లు పాల్గొన్నారు,

ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు క్యాంపెయిన్

విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన చేపట్టిన సమ్మె 17వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు క్యాంపెయిన్ కార్యక్రమాన్ని గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించారు. వందల సంఖ్యలో పోస్ట్ కార్డులను ముఖ్యమంత్రికి పంపేందుకు అందరూ రాశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు వై.తులసి, గౌరవాధ్యక్షులు పి.మణి, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్యామలాదేవి, కార్యదర్శి గుడివాడ అరుణ, ఐఎఫ్‌టియు కార్యదర్శి పి.లక్ష్మి తదితరులు మాట్లాడారు. టిడిపికి చెందిన ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

పెందుర్తి : సమస్యల పరిష్కారానికి 17రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా జనసేన అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల రమేష్‌బాబు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించి సమ్మె విరమణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున మద్దతుగా పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు గుర్తించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:స్థానిక సమస్యలపై మేనిఫెస్టో రూపొందించాలని మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత సూచించారు. నక్కపల్లి లో ఆమె స్వగృహంలో గురువారం సాయంత్రం పాయకరావుపేట నియోజకవర్గం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, రోడ్లు, మౌలిక వసతులపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు చర్చించుకుని స్థానిక మ్యానిఫెస్టో రూపొందించాలన్నారు. వచ్చే నెల మూడవ తేదీన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సమావేశం ఉందని, లోకల్ మేనిఫెస్టో పై చర్చించనున్నట్లు తెలిపారు .ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, సర్పంచ్ ల అధికారాన్ని తుంగలోకి తొక్కారన్నారు.రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే సర్పంచ్ లకు చెల్లించాల్సిన బిల్లులు ఇవ్వడం జరుగుతుందన్నార..

సమావేశంలో మాట్లాడుతున్న అనిత

'బస్సు యాత్రలతో ఒరిగిందేమిటి'?

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:సాధికారక బస్సు యాత్రలతో ప్రజలకు ఒరిగింది ఏమి లేదని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ప్రశ్నించారు. ఈ నెల 30న నర్సీపట్నంలో వైసిపి చేపట్టే సాధికార యాత్రపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలంతా కష్టాల్లో ఉంటే వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు సాధికార బస్సు యాత్రలు చేపట్టడం ఏంటని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఏముఖం పెట్టుకొని యాత్రలు చేపడతారని దుయ్యబట్టారు. అన్‌రాక్ నిర్వాసితులకు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. గొలుగొండ నర్సీపట్నం ప్రధాన రహదారి ఆరిలోవ అటవీ ప్రాంతం రోడ్డు నిర్మాణం చేపట్టలేదన్నారు. నర్సీపట్నం కేంద్రంగా మినీ ఐటిడిఎ ఏర్పాటు చెప్పిన ఎమ్మెల్యే హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, టౌన్ నాయకులు మారిశెట్టి రాజా, నాతవరం మండల నాయకులు వేగిశెట్టి శ్రీను పాల్గొన్నారు.